క్లుప్తంగా

తిరునాళ్ల మహోత్సవానికి దద్దాలకు ఆహ్వానం


దద్దాలకు ఆహ్వాన పత్రాన్ని అందచేస్తున్న నేతలు

కనిగిరిరూరల్: పామూరులోని శ్రీ రుక్మిణి సమేత మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ పార్టీ నాయకులు మంగళవారం పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందచేశారు. కార్యక్రమంలో ఇర్రి కృష్ణారెడ్డి, చెనికల శ్రీనివాసులు, రేగులగడ్డ నాగరాజు, దుగ్గన వెంకట సుబ్బయ్య, మిత్తికాల బాలకృష్ణా, పేరం నిలేష్, పేరం సంతోష్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం 25 మంది గర్భిణులకు డాక్టర్ సందీప్, డాక్టర్ లక్ష్మీ భార్గవిలు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రసవం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వీ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు గోరా బాలుడు, పద్మావతి, ఏఎన్ఎంలు, నర్సులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు: మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం సందర్భంగా ఎటువంటి విద్యుత్ సంబంధిత ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

నిరుద్యోగులను మోసం చేసిన కూటమి సర్కార్

కనిగిరిరూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి సర్కార్ నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా.. నిరుద్యోగ భృతి కల్పించలేదని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని, ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు గద్దె నెక్కిన తర్వాత నిలువునా మోసం చేశారని మండి పడ్డారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ పవన్ కళ్యాణ్, మాచపల్లి పూర్ణ చంద్రరాజు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి


ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కనిగిరిరూరల్: సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం తీవ్రంగా విఫలం చెందిందని సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు అన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఏఐటీయూసీ నాయకులు ఖాశింపీరా, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి

సీఎస్‌పురం(పామూరు): దర్శిలో ఈ నెల 21 నుంచి 23వ తేదీవరకు జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కే.వై.పెద్దమస్తాన్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడులో మంగళవారం సీపీఐ సమితి సమావేశం సమావేశం నిర్వహించారు. జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరు విధిగా తరలి రావాలన్నారు. అదేవిధంగా ఆగస్టు 23 నుండి 25వ తేదీవరకు రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ

కనిగిరిరూరల్: మండలంలోని ఏరువారిపల్లి, గోసులవీడు సచివాలయాలను ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రైవేట్ బడి.. అంతులేని దోపిడీ

- నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల నిర్వహణ
- ఇష్టం వచ్చినట్లు ఫీజుల వసూలు
- పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫాం కొనాలని నిబంధన
- కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే పాఠశాలల నిర్వహణ
- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని విద్యాశాఖ ఉన్నతాధికారులు పంచాయతీలకు



టంగుటూరు:

వేసవి సెలవులు ముగిసి విద్యా సంవత్సరం కానుండటంతో ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి మళ్లీ మొదలు కానుంది. కనీస సౌకర్యాలు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో ఆ పాఠశాలల జోలికి పోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నా ఫీజులు మాత్రం ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారు.

నిబంధనలు బేఖార్..

ప్రైవేట్, కార్పొరేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకుండా పోయింది. నియోజకవర్గంలో 47 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నాయి. ఏ పాఠశాలలోనూ ఫీజుల వివరాలను తెలియజేసే బోర్డులు కనిపించడం లేదు. ఏటికేడు ఇష్టం వచ్చినట్లు ఫీజులు పెంచేసి తల్లిదండ్రులను దోచుకుంటున్నారు. పాఠశాలలోనే యూనిఫాం, టై, బెల్టులు, పుస్తకాలను సైతం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇవి విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. బయట రూ.10లకు లభ్యమైనే వస్తువులను ఇక్కడ రూ.100 వరకు విక్రయిస్తున్నారు. విధి లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు వాటిని అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది.

కనీస సౌకర్యాలు నిల్

ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదు. అధిక శాతం పాఠశాలలు రేకుల షెడ్లలోనే కొనసాగుతున్నాయి. ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలలు అనుమతులు ఒక ప్రాంతంలో తీసుకొని మరో ప్రాంతంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. మర్రిపూడి మండలంలోని ఒక పాఠశాల ఇలానే నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కనీస సౌకర్యాలు మాత్రం కల్పించడంలేదు. కనీసం మూత్ర విసర్జనకు వెళ్లాలన్నా క్యూలో నిలబడే పరిస్థితి ఇక్కడ ఉంది. టంగుటూరు మండలం కందులూరులో ఉన్న పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవు. ఈ పాఠశాలలను విధిగా తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై ఎంఈఓ చెంచుపున్నయ్యను వివరణ కోరగా..నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల వివరాలను విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించామని, వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆ పాఠశాలల అనుమతులు రద్దు చేయాలి:



విద్యా శాఖ అధికారులు కన్ను తెరవాలి. రేకుల షెడ్లు, ఇరుకు గదుల్లో బోధనలు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల అనుమతులు రద్దు చేయాలి. పుస్తకాలు, యూనిఫాం విక్రయాలతో విద్యా సంస్థలు చేస్తున్న వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయకపోతే ఆందోళనలు తీవ్రతం చేస్తాం. అర్హతలున్న వారినే ఉపాధ్యాయులుగా నియమించుకోవాలి.

వి.మోజెస్, సీపీఐ మండల నాయకుడు

అధిక ఫీజులు నియంత్రించాలి:



ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం భరించలేకుండా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదు. పాఠశాలలోనే యూనిఫాం, పుస్తకాలని కొనాలని నిబంధన తల్లిదండ్రులకు భారంగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

సి.బ్రహ్మయ్య, మర్లపాడు గ్రామం

జగనన్న పర్యటనను విజయవంతం చేయండి

కనిగిరిరూరల్: పొగాకు రైతుల నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించి రైతుల పక్షాన పోరాటం చేసేందుకు ఈ నెల 11న పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం పాలనలో రైతాంగం పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. పొగాకు, మిర్చి, కంది, మినుము అన్ని రకాల పంటలకు మద్దతు ధర లేక రైతాంగం తల్లడిల్లుతుందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓటేసి మోస పోయిన రైతులంతా పొదిలికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. మండలంలోని నందనమారెళ్ల వద్ద ఉన్న గుడి వద్దకు నియోజకవర్గంలోని అన్ని మండలాల వాహనాలు(ఆటోలు, కార్లు, బస్సులు, తుఫానులు) చేరుతాయన్నారు. అక్కడి నుంచి ఉదయం 7.30 లకు వాహనాలు ర్యాలీగా బయలు దేరుతాయన్నారు.

☛ జగనన్న పోరుబాట కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించి, పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో మాట్లాడారు.

☛ జగనన్న పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు.

జగనన్న పోరుబాట విజయవంతం చేయండి

హనుమంతునిపాడు: పొగాకు రైతులకు మద్దతుగా ఈ నెల 11న పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలం నుంచి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.

పీసీపల్లి: పొగాకు రైతులకు అండగా ఉండేందుకు బుధవారం పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కూలి బకాయిలు వెంటనే విడుదల చేయాలి


కొణిజేడులో నిరసన తెలుపుతున్న కూలీలు

టంగుటూరు: గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని కొనిజేడులో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతంలో ఆయన మంగళవారం పర్యటించారు. గత 12 వారాలుగా తమకు వేతనాలు రాలేదని, రెక్కల కష్టం మీద ఆధారపడి జీవించే తమకు చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతకాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి చట్టం ప్రకారం పనిచేసిన 15 రోజుల్లో ఉపాధి హామీ కూలీలకు వేతనాలు ఇవ్వాలని, ఆలస్యమైతే వడ్డీతో కలిపి ఇవ్వాలని చట్టం చెబుతుందన్నారు. మూడు నెలలుగా వేతనాలు అందక కూలీల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. పనిచేసే ప్రాంతాల్లో కూలీలకు సరైన వసతులు కల్పించాలన్నారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్ మాట్లాడుతూ గ్రామాల్లో తగిన పనులు దొరక్క వలసపోయి తిరిగి వచ్చిన వారికి జాబ్ కార్డులు తొలగించారని, వారందరికీ కార్డులు ఇవ్వాలని అన్నారు. ఉపాధి హామీ పని దినాలను ఏడాదికి 200 రోజులు పెంచాలని, పెరుగుతున్న ధరలు అనుకూలంగా కనీస వేతనం రోజుకి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హనుమంతునిపాడు: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని సీతారాంపురం పంచాయతీ కూలీలు గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ పని కల్పించాలన్నారు. 10 వారాల బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు.

మండల సమావేశంలో సమస్యల ఏకరువు


సమస్యలను ఎమ్మెల్యే, ఎంపీపీవద్ద ఏకరువు పెడుతున్న సర్పంచ్

పామూరు: మండలంలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో మంగళవారం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పామూరు ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, యాటా గోవిందమ్మ, షేక్.అబ్దుల్, కట్టకిందపల్లె ఎంపీటీసీ అంగట్ల శివకుమారి మాట్లాడుతూ కమ్యూనిటీ వైద్యశాలలో స్పెషలిస్టు డాక్టర్లు లేరని, దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం వైద్యులను ఏర్పాటుచేయాలని కోరారు. మండలంలోని రేగుచెట్లపల్లెలో పశువైద్యాధికారి, సిబ్బంది లేరని, వైద్యశాలలో వసతులు కూడా లేవని పశుపోషకులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని స్థానిక ఎంపీటీసీ బొల్లా నరసింహారావు సమావేశం దృష్టికితేగా వైద్యుల నియామకానికి కృషి చేస్తామన్నారు. పామూరులో క్రీడాస్థలానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలు కేటాయించాలని కోఆప్షన్ నాయబ్‌రసూల్, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ సమావేశంలో కోరగా స్థలాన్ని స్థలాలు పరిశీలించాలని ఎమ్మెల్యే, ఎంపీపీ తహసీల్దార్ వాసుదేవరావుకు సూచించారు. పామూరు విరాట్‌నగర్‌లో నీటి ఎద్దడి ఉందని సమావేశంలో ఎంపీటీసీ వెంకటేష్ చెప్పగా త్వరితగతిన సమస్య పరిష్కరించాలని ఈఓపీఆర్‌డీ అరవిందారెడ్డికి సూచించారు. మండలంలోని 30వ మైలువద్ద నుంచి కరోళ్లపాడుకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా ఉందని ప్రయాణం కష్టంగా ఉందని ఎంపీటీసీ బొల్లా నరసింహారావు సమావేశం దృష్టికితేగా త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. ఇనిమెర్ల ఎస్సీకాలనీ పాఠశాల విలీనంను ఉపసంహరించుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం మధ్యంలో ఆగిపోయిందని నిధులు కేటాయించాలని సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి కోరగా పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. పామూరుకు డిగ్రీకళాశాల మంజూరుచేయించాలని, బాలికల హైస్కూల్ ఏర్పాటుచేయాలని, హైస్కూల్‌కు పూర్తిస్థాయి ఉపాధ్యాయులను కేటాయించేలా చూడాలని కోఆప్షన్ నాయబ్‌రసూల్ కోరగా హైస్కూల్, కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడీలకు సొంతభవనాలులేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త భవనాలు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే, ఎంపీపీ దృష్టికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరగా ఇప్పటికే ప్రపోజల్స్ వెళ్లాయని, కొన్నింటికీ స్థల సమస్య ఉందని, త్వరలో కార్యరూపం దాల్చుతాయన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, తహసీల్దార్ ఆర్.వాసుదేవరాజు, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఈఓపీఆర్‌డి అరవిందారెడ్డి, ఎంపీటీసీలు పోలినేని శ్రీను, గట్లా శివకుమారి, పిడికిటి సుబ్బరత్తమ్మ, రెక్కల అనితారెడ్డి, నవరం రత్తమ్మ, మెడబలిమి ఆదిలక్ష్మమ్మ, నాసర్‌బీ, సర్పంచ్‌లు కొండబాబు, పలువురు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా జిల్లా కార్యదర్శి నారాయణ

కొండపి: రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. సీపీఐ నియోజకవర్గ నాల్గవ మహాసభలు పొదిలి రోడ్డులోని కామ్రేడ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ సీపీఐ జిల్లా మహాసభలు ఈ నెల 21, 22 తేదీల్లో జరుగుతాయన్నారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో నిర్వహిస్తామన్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని తెలిపారు. మత, కుల, ప్రాంతీయతత్వాలతో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ విధ్వంసం చేస్తుందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డెక్కి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రూ.4 వేల కోట్లు కేటాయిస్తే వెలిగొండ పూర్తయి జిల్లా సస్యశ్యామలం అవుతుందని, అది చేయటానికి చేతకాని చంద్రబాబు రూ.84 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్ట్ చేపట్టి పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు ఆర్. వెంకట్రావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి, ఆర్.లక్ష్మి, టి.ప్రభాకర్, డి.బాలాజీ, కె.రమేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

బొప్పాయి పంటకు నష్టం


ఎండిపోతున్న బొప్పాయి తోట.

కొండపి: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కట్టవారిపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు మామిడిపల్లి లక్ష్మీనారాయణ నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి తోట సాగు చేశారు. అయితే బొప్పాయి తోటకు విద్యుత్ సరఫరా అయ్యే ఇన్సులేటర్లు దెబ్బతిని మోటార్లు పని చేయడం లేదు. దీనిపై 20 రోజుల క్రితం నుంచి ప్రతి రోజు విద్యుత్ సిబ్బందికి తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇన్సులేటర్లు కార్యాలయంలో లేవని, మీరే తెచ్చుకోండి వేస్తామని సమాధానం ఇస్తున్నారని తెలిపాడు. గత 20 రోజుల నుంచి పొలానికి నీళ్లు పెట్టకపోవడంతో పంట చేతికి వచ్చే సమయంలో ఆకులు ఎండు ముఖం పట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పొలానికి నీళ్లు వచ్చే విధంగా చూడాలని కోరుతున్నాడు.

సాక్షిపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడే

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడంతో పాటు సాక్షి కార్యాలయాలపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడి అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తీవ్రంగా ఖండించారు. డిబేట్‌లో జర్నలిస్టులు చెప్పే అభిప్రాయాలు వారి వ్యక్తిగతమని, వాటిని సాక్షి ఛానెల్‌కు ఆపాదించి కొమ్మినేనిని అరెస్టు చేసి కార్యాలయాలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం చూస్తుంటే రాష్ట్రంలో అటవిక పాలన సాగుతుందని అర్థమవుతుందన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 14,15,21 అమలు కావటం లేదని, న్యాయస్థానాలు ఈ ఘటనలను సుమోటోగా స్వీకరించి విచారించి దోషులను కఠినంగా శిక్షించి రాష్ట్రంలో రాజ్యాంగాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలు నివారించాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ ప్రభావతి

కందుకూరు రూరల్: బాల్య వివాహాలను నివారించాలని, చట్టాలపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి అన్నారు. మండలంలోని మోపాడు అంగన్‌వాడీ కేంద్రం-2లో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహ రహిత గ్రామంగా మోపాడును తయారు చేయాలన్నారు. బాల్య వివాహం ఎవరైనా చేస్తుంటే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ఎక్కువగా బాల్య వివాహాలు ఆర్థిక పరిస్థితులు, అవగాహన లేమితోనే జరుగుతుంటాయని చెప్పారు. వీటిని వెంటనే గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ఉండే కమిటీలు వీటిపై దృష్టి సారించాలన్నారు. వివాహం చేస్తున్నారంటేనే గ్రామంలో ఒక సమాచారం ఉంటుంది. అలా సమాచారం ఇచ్చినప్పుడు వెంటనే వారి వయసు ఎంత? ఏం చదువుతున్నారనే విషయాలు సేకరించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు మానేశారంటే వారిపై నిఘా ఉంచాలన్నారు. పాఠశాల మానేయడానికి కారణం ఏమిటి, ఎందుకు మానేసేశారు. మరెక్కడైనా చేరారా లేక ఊర్లో ఉంటున్నారు లేదా అనే సమాచారం సేకరిస్తే వెంటనే వారి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కిశోర బాలికల తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం మోపాడును బాల్య వివాహ రహిత పంచాయతీగా తీర్చిదిద్దాలని ప్రతిజ్ఞ చేయించారు. మహిళా పోలీస్ శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.సుభాషిణి, లలితాలక్ష్మి, టి.శ్రీలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

పొగాకు కనిష్ట ధర రూ.180


టంగుటూరులో వేలం

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో కనిష్ట ధర రూ.180 పలికింది. వేలానికి కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 675 బేళ్లను వేలానికి తీసుకురాగా 527 బేళ్లను కొనుగోలు చేసి 148 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.240.59గా నమోదైంది. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

6వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 6వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభమైంది. క్లస్టర్ పరిధిలోని అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం, జువ్విగుంట గ్రామాలకు చెందిన రైతులు 882 బేళ్లను వేలానికి తీసుకురాగా 589 బేళ్లను కొనుగోలు చేసి 293 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.238.77గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.

కమనీయం..కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పామూరు: స్థానిక మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం రాత్రి ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో ఆర్య వైశ్య ఉభయం సందర్భంగా ఆలయ కల్యాణ మండపంపై అర్చకులు వేదమంత్రాలతో రుక్మిణి, సత్యభామ, మదన వేణుగోపాలస్వామివార్ల ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరగనుంది.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు